
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.7, కనిష్ఠం 14.5



కామారెడ్డి
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 డిసెంబరు 2025

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

మాచారెడ్డి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి కామారెడ్డికి చెందిన పడాల సుదర్శన్ రూ.10,100లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అన్నారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులను అర్చకులు, సిబ్బంది సన్మానించి స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అపర్ణ

విశ్వవిద్యాలయ విద్యార్థులు..
అవకాశాలను ఉపయోగించుకోవాలి

» ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ సమన్వయ కర్త అపర్ణ

భిక్కనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నూతన విద్యార్థులు విశ్వవిద్యాలయాల్లో ఉండే అవకాశాలను ఉపయోగించుకుని భవిష్యత్తును నిర్మించుకోవాలని ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ సమన్వయ కర్త, బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ అపర్ణ సూచించారు. శనివారం భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నూతన విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులని, తర్వాత విద్యాబోధన చేసే గురువులన్నారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు చేసి పిల్లలను చదివిస్తున్నారని, వాళ్ల కష్టాలను గుర్తించాలన్నారు. ఇప్పటి నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు ముందుకు సాగాలన్నారు. ప్రపంచీకరణ దృష్ట్యా ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా ఉద్యోగాలను సృష్టించుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్ మాట్లాడుతూ సౌత్ క్యాంపస్‌లో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు సునీత, యాలాద్రి, ఏపీఆర్వో సరిత, ప్రొఫెసర్లు మోహన్‌బాబు, అంజయ్య, నాగరాజు, హరిత, ప్రతిజ్ఞ, సంతోష్‌గౌడ్, పోతన్న, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


క్రీడలతో మానసికోల్లాసం

» డీఈవో రాజు

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని డీఈవో రాజు అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-14 బాలబాలికల హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ విద్యార్థులుప్రథమ స్థానంలో, స్ప్రింగ్ ఫీల్డ్ హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో కేజీబీవీ బిక్నూర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, కేజీబీవీ కామారెడ్డి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఈవో రాజు బహుమతుల్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి పాఠశాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మరిన్ని క్రీడలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ రంగ వెంకటేశ్వర్ గౌడ్,స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ హిరాలాల్,పాల్గొన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నోముల మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు,లక్ష్మణ్, స్రవంతి, మానస, సృజన తదితరు లు పాల్గొన్నారు.

జిల్లాలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారు అనే దానిపై ఆరా తీస్తున్నారు. గ్రామాలను విడిచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్లకు తమకు మద్దతు ఇవ్వాలని ఫోన్లు చేస్తూ, వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి వారి ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టెక్స్ట్‌మెసేజ్‌ల ద్వారా తమ సందేశాన్ని పంపుతున్నారు. ఎలాగైనా గ్రామంలో జరుగుతున్న ఎన్నికల్లో పాల్గొని తమను గెలిపించాలని కోరుతున్నారు.

ఓటర్లకు గాలం




» గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఆఫర్లు
» గంపగుత్త ఓట్లపై ఫోకస్
» కుల సంఘాలకు తాయిలాల ఎర
» ఆలయాలకు విరాళాలు
» వంట, టెంట్ సామగ్రి తదితరాల అప్పగింత
» వలస ఓటర్లతో సంప్రదింపులు
» భిన్నంగా అభ్యర్థుల ప్రచారం

కామారెడ్డి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మొదటి విడతలో 167 సర్పంచ్, 1520 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో 11 పంచాయతీలు, 433 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 156 సర్పంచ్ స్థానాలకు 733 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, 1084 వార్డు స్థానాలకు 3,240 అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీటికి ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. రెండో విడతలో 197 సర్పంచ్, 1,650 వార్డు స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాలకు బరిలో ఉండే అభ్యర్థుల లెక్క శనివారం తేలింది. ఇక ప్రచారం ముమ్మరం చేయడమే కాకుండా గెలుపే లక్ష్యంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేల హామీలతో పాటు పలు ఆఫర్లు చేస్తున్నారు. గంపగుంత ఓట్లను రాబట్టేందుకు కుల సంఘాలకు భారీగా తాయిలాలకు గాలం వేస్తున్నారు. ఇందులో భాగంగా కుల సంఘాలను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ఆరాటపడుతున్నారు. వలస ఓట్లపైన ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇతర ప్రాంతాల్లో ఓటర్లను పోలింగ్ రోజు రప్పించుకునేలా సంప్రదింపులు మొదలుపెట్టారు.

భిన్నంగా ప్రచార పర్వం

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం భిన్నంగా సాగుతోంది. ఈ ఎన్నికల్లో పార్టీలకంటే వ్యక్తులకే ప్రాధాన్యత ఉండటం వల్ల మెజారిటీ అభ్యర్థులు తమ వ్యక్తిగత ప్రచారంతోనే ముందుకు సాగుతున్నారు. కొందరు మంది మార్బలంతో హడావిడి చేస్తుండగా, చాలా మంది ఒక్కరుగా రాత్రి, తెల్లవారుజామున ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి తమకు ఓటు వేయాలని మాట తీసుకుంటున్నారు. మరికొందరు సోషల్ మీడియా ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది. వాట్సాప్‌లో సందేశాలు, టెక్స్ట్ మెసేజ్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ప్రచారాలను హోరెత్తిస్తున్నారు. కొందరు అభ్యర్థులు పాటల రూపంలో తమ ప్రచారాన్ని నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.



కుల సంఘాలకు తాయిలాలు

పంచాయతీ ఎన్నికల్లో తమ సత్తాను నిరూపించుకోవడానికి సిద్ధమైన అభ్యర్థులు ఎలాగైనా గెలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలోనే గెలుపు కోసం అనువైన మార్గాలపై దృష్టి పెట్టారు. గ్రామాల్లో గెలుపోటములను ప్రభావితం చేసేది కుల సంఘాలే. దీంతో కుల సంఘాలకు చెందిన పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. కొందరైతే భారీగా నజరాలను ప్రకటిస్తూ అందజేస్తున్నారు. ప్రధానంగా కుల సంఘాలకు చెందిన ఆలయాలకు పెద్ద మొత్తంలోనే విరాళాలను అందజేస్తున్నారు. అంతేకాకుండా వంట, టెంటు సామగ్రిని సైతం ఆఫర్ చేస్తున్నారు. ఇవే కాకుండా కుల సంఘాల్లోని సభ్యుల లెక్క మేరకు ఒక్కొక్కరికి కొంత మేరకు నగదును ముట్ట చెబుతున్నారు. పోలింగ్ సమయం దగ్గర పడుతుండడంతో ఈ వ్యవహారం వేగంగా సాగుతోంది. మొదటి విడత ఎన్నికల్లోని మేజర్ గ్రామ పంచాయతీల్లో తాయిలాల వ్యవహారం ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఓ అభ్యర్థి తన గ్రామంలో ఓ సంఘానికి అత్యధికంగా రూ.12 లక్షల వరకు ముట్ట చెప్పడం చర్చనీయాంశం అయింది. (మిగతా 8లో..)

వలస ఓటర్లకు ఫోన్లు

గ్రామాల నుంచి నగరాలు, పట్టణాలకు వలస వెళ్లిన వారిలో అనేక మంది ఓటర్లు ఉన్నారు. గ్రామాల్లో ఓటు ఉండి ఉపాధి, ఉద్యోగం, విద్య రీత్యా హైదరాబాద్‌తో పాటు పొరుగు జిల్లాలకు వలస వెళ్లారు. ఆ ఓటర్లకు అభ్యర్థులు ఫోన్లు చేసి బరిలో ఉన్నామంటూ చెబుతూ మద్దతు కోరుతున్నారు. పోలింగ్ రోజు ఓటేసేందుకు గ్రామానికి రావాలని ముందుగానే ఫోన్ ద్వారా ఓ మాట చెప్పి ఉంచుతున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

అపార విజ్ఞాన సంపన్నుడు..
రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్

» ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అపార విజ్ఞాన సంపన్నుడు అంబేద్కర్ అని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద గల ఆయన విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దీన జన ఉద్ధారకుడని అన్నారు. పోరాటమే జీవితంగా మార్చుకుని, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని ప్రజలందరికీ సమ్మతమైన రాజ్యాంగాన్ని రచించాడని తెలిపారు. అంబేద్కర్ ఆశయానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోటూరి శ్రీకాంత్, విపుల్ జైన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

ఎన్నికలు పూర్తయ్యే వరకు
కోడ్ అమలులో ఉంటుంది

» కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు దశల్లో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో సర్పంచ్, వార్డ్ సభ్యుల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి దశ, రెండవ దశల్లో ఎన్నికైన సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు లేదా ఇతరులు కూడా మూడవ దశ ఎన్నికలు, పరోక్ష ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదన్నారు. ఎవరైనా కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని ఈవీఎం గోడౌన్లను రాజకీయ నాయకుల ప్రతినిధులతో పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

కలెక్టర్ సమక్షంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

రెండు, మూడు విడత పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో పూర్తి చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల (మిగతా 8లో..)

ట్రాఫిక్ సమస్యను
పరిష్కరించేందుకు కృషి



ముున్సిపల్ వాణిజ్య సముదాయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

» సర్వే నెంబర్ 6లో మార్కెట్ కొనసాగేలా చూస్తాం
» రైల్వేస్టేషన్ రోడ్డులోని మడిగెలు తొలగించేందుకు వ్యాపారులు సహకరించాలి
» వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా నూతనంగా నిర్మించే మునిసిపల్ మడిగెలలో అవకాశం కల్పిస్తాం
» ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుందని, దీర్ఘకాలికంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను వంతుల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం కామారెడ్డి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. అమృత్ స్కీమ్ కింద ప్రధాని మోదీ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు నిధులు మంజూరు చేసారని, పనులు కొనసాగుతున్నాయన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్ర అభివృద్ధి విషయంలో ప్రజలు సహకరిస్తే వందేళ్ల భవిష్యత్తు కనిపిస్తుందని తెలిపారు. రైల్వే స్టేషన్ గోడను ఆనుకుని ఉన్న మడిగెలు తొలగిస్తే ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద నిత్యం ఏర్పడే ట్రాఫిక్ సమస్య ఎంతో కొంత తగ్గుతుందన్నారు. అంతేకాకుండా స్టేషన్ రోడ్డు మధ్యలో రైల్వే స్టేషన్లోకి ఎంట్రన్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత రైల్వేశాఖ మంత్రిని కోరుతున్నామన్నారు. ఇప్పటికే మున్సిపల్ అధికారులు సైతం ఆ ప్రాంతంలోని వ్యాపారులకు నోటీసులు అందించారని తెలిపారు. మడిగెలలో వ్యాపారం చేస్తున్నవారు తన వద్దకు వచ్చి షాపులు తొలగిస్తే తమ జీవనాధారం దెబ్బతింటుందని తనతో చెప్పారన్నారు.వ్యాపారుల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టబోమని, అలాగని ట్రాఫిక్ ఇబ్బందులను సైతం తొలగించకుండా ఉండలేమని వారికి వివరించినట్లు తెలిపారు. పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద, గంజు ఉన్నత పాఠశాల ముందు మున్సిపల్ వాణిజ్య సముదాయాలను నిర్మించనున్నామని మొదటగా ఈ వ్యాపారులకు అవకాశం కల్పించాకే మిగిలిన వారికి అవకాశం కల్పిస్తామని వివరించానని అన్నారు. ఇందులో ఎలాంటి స్వార్థం, రాజకీయం లేదని స్పష్టం చేశారు. సర్వే నెంబర్ 6 లో గత 40 ఏళ్లుగా అనధికారికంగా కబ్జాలో ఉన్న కోట్ల విలువగల స్థలాన్ని ఇటీవల ఖాళీ చేయించామని, ఒకరిద్దరు తెచ్చుకున్న స్టేను ఈ నెల 12న స్టేటస్‌కో క్యాన్సిల్ చేయించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డుపై నిర్వహిస్తున్న కూరగాయల మార్కెట్‌ను సర్వే నెంబర్ 6లోకి మార్చడం (మిగతా 8లో..)

సాయి ఈశ్వరాచారి మృతికి నిరసనగా ర్యాలీ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా కేంద్రంలో స్వర్ణకార సంఘం, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో స్వర్ణకార సంఘ భవనం నుంచి తిలక్ రోడ్డు, జేపీఎన్, సిరిసిల్లా రోడ్ మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి ఒక నిప్పు కనికలా తన ప్రాణాన్నే త్యాగం చేసిన వీరుడు సాయి ఈశ్వరాచారి అని అన్నారు. బీసీలకు అడుగడుగునా జరుగుతున్న అన్యాయాన్ని తట్టుకోలేక ఒంటిపై పెట్రోల్ పోసుకొని చనిపోయాడని ఇది ఆత్మహత్య కాదని ముమ్మాటికీ కాంగ్రెస్, బీజేపీలు చేసిన హత్యేనని అన్నారు. అగ్రవర్ణ నాయకులైన రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డిలే దీనికి బాధ్యత వహించాలని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసిన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, 9వ షెడ్యూల్లో చేర్చకుండా చోద్యం చూస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం రెండు పార్టీలు బీసీ ద్రోహులేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పోటీ చేస్తే కూడా ఓర్వలేని అగ్రవర్ణ నాయకులు ఇటీవల నల్గొండలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి అనుచరులు చేసిన ఆకృత్యమే ఉదాహరణ అని అన్నారు. బహుజన బీసీ బిడ్డ యాదవ్ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి పోటీలో ఉంటే కిడ్నాప్ చేసి బలవంతంగా మూత్రం తాగించిన ఘటన చూస్తేనే తెలుస్తోంది. వాళ్ల కుటిల నీతి, ఇలాంటి నాయకుల ఆగడాలు చూసి తట్టుకోలేక సాయి చనిపోవడం విచారకరమని అన్నారు. ఆనాడు (మిగతా 8లో..)



కామారెడ్డిలో ర్యాలీ చేపడుతున్న బీసీ, స్వర్ణకార సంఘం నాయకులు

హోదా దక్కినా.. అభివృద్ధి దూరమేనా?

» 8 నెలల క్రితం మునిసిపాలిటీ హోదా
» ఇప్పటికీ మంజూరు కాని సిబ్బంది
» బిచ్కుందలో కుంటుపడిన అభివృద్ధి
» విలీన గ్రామాల్లో సైతం సమస్యలు
» సిబ్బందిని కేటాయించాలని వేడుకోలు

7

సంత మల్లన్న.. సల్లంగా సూడు

» నేటి నుంచి అంక్సాపూర్‌లో ఉత్సవాలు
» రేపు జాతర, రథోత్సవం

6



హోంగార్డుల..
సేవలు అమూల్యమైనవి

» శాంతి భద్రతల పరిరక్షణలో వారి పాత్ర వెల కట్టలేనిది
» హోంగార్డుల పరేడ్‌లో ఎస్పీ రాజేష్‌చంద్ర
» ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాల అందజేత



మాట్లాడుతున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

కామారెడ్డి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు అమూల్యమైనవని ఎస్పీ రాజేష్‌చంద్ర అన్నారు. శనివారం 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డులు ఆఫీసర్స్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి, హోంగార్డులు ప్రదర్శించిన పరేడ్‌ను పరిశీలించారు. హోంగార్డుల సంక్షేమం కోసం జిల్లా పోలీసుశాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. హోంగార్డుల శాంతిభద్రతలు, అత్యవసర పరిస్థితుల్లో అందిస్తున్న సేవలు అత్యంత విలువైనవని అన్నారు. 1946లో బొంబాయిలో ప్రారంభమై 1962 చైనా దాడుల అనంతరం దేశవ్యాప్తంగా స్వచ్ఛంద దళాలందరినీ ఒకే సంస్థగా ఏకం చేసి హోంగార్డుల వ్యవస్థను బలోపేతం చేశారన్నారు. హోంగార్డులకు జిల్లాల ఏర్పాటు నుంచి మెడికల్ గ్రాంట్లు, కరోనా సమయంలో ప్రత్యేక సహాయం, సహజ, ప్రమాద మరణాలపై ఎక్స్‌గ్రేషియా, ఫ్యూనరల్ చార్జీలు, వెల్ఫేర్ గ్రాంట్లు అందించడం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని 234 మంది హోంగార్డులకు ఉలెన్ జాకెట్లు, రైన్‌కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రోజువారి భత్యం రూ.921 నుంచి రూ.1,000కు, పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200కు పెంపు జరిగినట్లు తెలిపారు. రాష్ట్రంలో మరణించిన 23 మంది హోంగార్డుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.1.15 కోట్లు విడుదల చేసిందని అన్నారు. (మిగతా 8లో..)

బెదిరింపులకు గురి చేస్తే..
ఎన్నికలు రద్దు చేస్తాం

» సబ్ కలెక్టర్ కిరణ్మయి

బీర్కూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తే ఎన్నికలను రద్దు చేస్తామని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి హెచ్చరించారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భోగవల్లి అప్పారావు, వడ్ల బాలరాజు, నూకల రాము, నేనావత్ రాజ్‌కుమార్ అనే నలుగురు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే నేనావత్ రాజ్‌కుమార్ అనే అభ్యర్థి తనను పోటీ నుంచి తప్పుకోవాలంటూ కొందరు బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ శుక్రవారం సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీవో శ్రీనిధి, ఎస్సై మహేందర్‌లతో కలిసి తిమ్మాపూర్ గ్రామానికి విచ్చేశారు. సర్పంచ్ ఎన్నికల పోటీల్లో నిలిచిన అభ్యర్థులను పిలిపించి గ్రామపెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. ఎవరు బెదిరించారు, ఎందుకు బెదిరించారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. బెదిరింపులకు పాల్పడితే ఎన్నికలు రద్దు చేస్తామని అన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరు కూడా నామినేషన్లు విత్‌డ్రా చేసుకోమని రాతపూర్వకంగా అధికారులకు రాసి ఇచ్చారు. ఏకగ్రీవం చేయడానికి అభ్యర్థులను బెదిరించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెదిరింపుల నేపథ్యంలో గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రైం సమాచారం

విద్యార్థి అదృశ్యం

నవీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాడాపూర్‌కు చెందిన తోకల అజయ్(16) అదృశ్యమయ్యాడని ఎస్ఐ తిరుపతి తెలిపారు. మండలంలోని జన్నేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న అజయ్ ఈ నెల 1న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. అజయ్‌కి గతంలో ఒకసారి ఇలాగే బయటకు వెళ్లగా బంధువుల ఇళ్లలో ఆచూకి లభించిందన్నారు. తండ్రి మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భార్య తనతో తరచూ గొడవపెట్టుకుంటుందనే మనస్థాపంతో సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేసిన సంఘటన ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో శనివారం జరిగింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, ఫైర్‌సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి సదరు వ్యక్తిని కిందికి దింపారు. బాధిత వ్యక్తి వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిలోని గాంధీనగర్‌కు చెందిన పవన్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నినెలలుగా తన భార్య తనతో గొడవపడుతూ కుటుంబానికి దూరం చేసి మానసికంగా వేధిస్తుందన్నారు. ఇప్పటికే పలుమార్లు ఎల్లారెడ్డి పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చినా ఆమెలో మార్పురావడం లేదని, తనకు భార్య, పిల్లలు దూరం అవుతుండటంతో మానసిక వేదనకు గురవుతున్నానని ఆవేదన చెందాడు. అనంతరం పవన్, అతని భార్యను కౌన్సెలింగ్ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై-2 సుబ్రమణ్య చారి, కానిస్టేబుల్ అమర్, ఫైర్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

చిరుత సంచారం

లింగంపేట, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లారం, బూరిగిద్ద, గాంధీనగర్ ప్రాంతంలో చిరుత సంచరిస్తుందని ఎస్సై దీపక్ కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డి- కామారెడ్డి రహదారిపై వెళ్లే ప్రయాణికులు రాత్రివేళల్లో జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. శుక్రవారం రాత్రి ఆ దారిలో వెళ్లే వారికి చిరుత కనిపించిందని తెలిపారు. వారం రోజులుగా మెంగారం శివారులో కనిపించిన చిరుత, శుక్రవారం ఎల్లమ్మతండా, బూరిగిద్ద ప్రాంతంలో కనిపించడంతో వాహనదారులు, ఆయా గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పల్లెల్లో సుదర్శన్‌రెడ్డి ప్రచారం


మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నవీపేట,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి కేఎల్‌వీ రేఖ రాజేందర్‌గౌడ్‌కు మద్దతుగా ప్రభుత్వ ముఖ్య సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమెను సర్పంచ్‌గా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కేఎల్‌వీ రాజేందర్ గౌడ్, మోస్రా సాయిరెడ్డి, భగవాన్ తదితరులున్నారు.

రెంజల్/ఎడపల్లి: రెంజల్, దూపల్లి, కళ్యాపూర్, సాటాపూర్, తాడ్‌బిలోలి, ఎడపల్లి మండలంలోని జానకంపేటలో సర్పంచ్ అభ్యర్థుల తరఫున ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, నాయకులు రాధా కిషన్ గౌడ్, విజయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న ఉత్సవాలు


మెండోరాలో భీమన్న గజాలను ఊరేగిస్తున్న నాయక్‌పోడు కులస్థులు

మెండోరా , డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో భీమన్న ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ ఆదివాసీ నాయక్‌పోడు కులస్థులు శనివారం ఉదయం ఆలయం వద్ద ఉన్న దేవుడు గజాలను గ్రామంలోకి తీసుకొచ్చి వీధుల్లో ఊరేగించారు. ఆదివారం ఉదయం వాటిని గంగస్నానం కోసం తీసుకెళ్లి సాయంత్రం గ్రామానికి చేరుకుంటారు. సోమవారం వేకువజామున భీమన్న దేవుని కల్యాణం, నాగేల్లి, అగ్నిగుండం కార్యక్రమాలు నిర్వహించినా తర్వాత గ్రామ ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థులందరు భీమన్న ఆలయం వద్దకు వనభోజనాలకు వెళ్తామని ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థులు తెలిపారు.

పలు పంచాయతీలు ఏకగ్రీవం

కమ్మర్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మరిసోడు తండా(డీసీతండా), కొత్తచెరువుతండాలు గ్రామ పంచాయతీగా ఏర్పడగా.. గతంలో ఏకగ్రీవం కాగా ఈ సారి డీసీతండా మాత్రమే ఏకగ్రీవమయింది. ఎస్టీ మహిళా రిజర్వేషన్ రావడంతో గ్రామస్థులు చర్చించుకొని గ్రామానికి చెందిన గుగులోత్ మంజుల దేవేందర్‌తో సర్పంచ్ ఒకే నామినేష్ వేయించారు. 6 వార్డులకు సైతం ఒక్కొక్క నామినేషన్ సమర్పించడంతో వార్డులూ ఏకగ్రీవమయ్యాయి. ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

జక్రాన్‌పల్లి: మునిపల్లి సర్పంచ్‌గా ఎం.చిన్నసాయిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సర్పంచ్ స్థానానికి ఎం.చిన్నసాయిరెడ్డి, చింతల గోపి నామినేషన్లు వేయగా.. గోపి ఉపసంహరించుకున్నారు. దీంతో చిన్నసాయిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే 12వార్డుల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మనోహరాబాద్ సర్పంచ్ స్థానం జనరల్ మహిళ రిజర్వేషన్ రావడంతో అల్లూరి లక్ష్మీ, అల్లూరి సుజాత నామినేషన్లు వేశారు. ఇందులో అల్లూరి సుజాత నామినేషన్ ఉపసంహరించుకోడంతో సర్పంచ్‌గా అల్లూరి లక్ష్మి, 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. నల్లగుట్ట తండా సర్పంచ్ స్థానానికి ఎస్టీ మహిళ రిజర్వేషన్ రావడంతో బానోత్ ప్రమీలా ఒక్కరే ఒకేనామినేషన్ వేశారు. దీంతో నల్లగుట్టతండా సర్పంచ్‌గా బనోత్ ప్రమీలా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ధర్పల్లి: సిరికొండ మండలంలోని సర్పంచ్ తండాలో మాలవత్ శోభ, గోప్యతండా సర్పంచ్‌గా భూక్య మంజుల, వర్న్యతండా సర్పంచ్‌గా బానవత్ బుజ్జి, గోప్యనాయక్‌తండా సర్పంచ్‌గా మాలవత్ సుబ్బా, నార్సింగ్‌పల్లి సర్పంచ్‌గా సుగణ, మెట్టుమర్రి తండా సర్పంచ్‌గా తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వృద్ధాశ్రమానికి విరాళం


వృద్ధాశ్రమ నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న విద్యార్థులు

ముప్కాల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని నవీన్ పబ్లిక్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రూ.18,263 విరాళాన్ని సేకరించి అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ.. శ్రీసాయి అనాథ ఆశ్రమంలో ఉంటున్న 40 మంది వృద్ధులకు వైద్యం, ఆహారం అందించేందుకు విద్యార్థులు సేకరించిన ఈ నగదును ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు విరాళాల రూపంలో డబ్బు సేకరించి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఆశ్రమ నిర్వాహకులు అన్నారు.

సంత మల్లన్న.. సల్లంగా సూడు

- నేటి నుంచి అంక్సాపూర్‌లో ఉత్సవాలు
- రేపు జాతర, రథోత్సవం


గర్భగుడిలో కొలువుదీరిన మల్లన్న స్వామి

వేల్పూర్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సంత మల్లన్న దయ ఉంటే చాలు అంతా మంచిగనే జరుగుతది.. ఏ సమస్య వచ్చినా స్వామిని వేడుకుంటే చాలు ఇట్టే పరిష్కారమవుతాయని వేల్పూర్ మండలం అంక్సాపూర్ వాసుల విశ్వాసం. స్వామివారి దయతోనే గ్రామం చలగా ఉందని, పాడి పంటలు, జీవరాశులు బాగుంటాయని వారు పేర్కొంటారు. అలాంటి దయగల్ల స్వామి జాతరకు వేళైంది. ఆదివారం నుంచి అంక్సాపూర్‌లో సంత మల్లన్న జాతర జరగనుంది. ఆలయ చరిత్ర, అభివృద్ధికి సంబంధించిన అంశాలు ఇలా ఉన్నాయి.

స్థల పురాణం ఏం చెబుతుందంటే..

అంక్సాపూర్ గ్రామానికి 3కి.మీ దూరంలో ఎత్తయిన కొండపై సంత మల్లన్న ఆలయం ఉంది. ఆలయం చుట్టూ దట్టమైన అడవిలో సాధువులు, సంతులు కఠోర తపస్సు చేసేవారు. అడవిలో పశువులు మేతకు వెళ్లేవి. అనుకోకుండా వ్యాధులు సోకి పశువులు చనిపోయాయి. దీంతో తీవ్ర ఆవేదనతో కుమిలిపోయిన పశువుల కాపారులు అడవిలో తపస్సు చేస్తున్న సాధుసంతులను వేడుకోగా.. గుట్టపై వెలసిన మల్లన్న దేవున్ని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయని సూచించారు. దీంతో ప్రజలు అక్కడికి వెళ్లి ఆలయం ఏర్పాటుచేసి స్వామిని పూజించగా.. వ్యాధులు దూరమై జీవరాశులు బతికాయని పెద్దలు చెబుతారు. అప్పటి నుంచి మల్లన్నకు నైవేద్యాలు సమర్పించుకుంటే అన్ని తొలగిపోతాయని వారి నమ్మకం. సంతులు చెప్పిన సూచనల ప్రకారం దేవుడిని వేడుకున్నామని అందుకే సంత మల్లన్న పిలుచుకుంటామని ప్రజలు చెబుతారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

ఉత్సవ మూర్తులను, సంతమల్లన్న విగ్రహాలను శనివారం పల్లకిలో ఆగ్గోల్ల సహాయంతో నగర డోలును మోగించుకుంటూ సంతమల్లన్న గుడివద్దకు తీసుకువెళ్తారు. అలాగే వీరితో పాటు బంతిపవ్వులతో అలంకరించిన షిడే(రథం) గుట్ట వద్దకు చేరుకుంటుంది. ఆదివారం ఉదయం కాలినడకన పల్లకిలో విగ్రహ ప్రతిమలను ప్రవిత గోదావరి నదిలో స్నానం కోసం చిట్టాపూర్ గ్రామానికి డప్పువాయిద్యాలతో తీసుకువెళ్తారు. అక్కడ గోదావరిలో స్నానంచేయించి రాత్రి అంక్సాపూర్ చేరుకుంటారు.ఆదివారం సంతమల్లన్న కల్యాణ మహోత్సవం, సోమవారం జాతర, రథోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో ఎడ్లబండ్లు, వివిధ వాహనాలపై గుట్ట వద్దకు వచ్చి మొక్కులు చెల్లిస్తారు. ఇందులో భాగంగా భక్తులు బోనాలు వేస్తూ 5రకాల ధాన్యాలను ఒక చోట వేసి వాటిపై ఉడికించిన నైవేద్యాలను సంత మల్లన్న దేవునికి సమర్పిస్తారు. బుధవారం గ్రామంలో జాతర నిర్వహిస్తారు. ఆలయం దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్నా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తారు.

గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో..


సంత మల్లన్న ఆలయం

అంక్సాపూర్ నుంచి ఆలయం వరకు, గుట్ట చుట్టు రథం తింపడానికి రోడ్లు నిర్మించారు. ధర్మశాలలు, విశ్రాంతి గదులు, గుట్టపైన, కింద తాగునీటి ట్యాంకు లను గ్రామభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన మణికంఠ, రిషి

రాష్ట్రస్థాయి పోటీలకు కలిగోట్ విద్యార్థులు

జక్రాన్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మణికంఠ, రిషి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమచారి, వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు మణికంఠ, రిషిని ప్రధానోపాధ్యాయడు పురుషోత్తమచారి, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

- జిల్లా విద్యా శాఖ అధికారి అశోక్

ముప్కాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, చదువులో రాణించేలా చూడాలని డీఈవో అశోక్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం బాల్కొండ ప్రభుత్వ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, శిక్షణ ఇవ్వాలని సూచించారు. తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని ఆదేశించారు. విద్యార్థులు అన్ని అంశాలను క్షుణంగా చదవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాంకిషన్, సురేష్ పాల్గొన్నారు.

అందరికీ రేషన్ బియ్యం అందాలి

- జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ఎడపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సన్న బియ్యం గ్రామంలోని రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సజావుగా అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఎడపల్లి మండలంలోని నెహ్రూనగర్ రేషన్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో కార్డు ఉన్న లబ్ధిదారుల సన్న బియ్యం పంపిణీ రికార్డులను పరిశీలించారు. గ్రామంలో రేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబాల సభ్యుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం నిల్వలు కేటాయించారా అని ఆరా తీశారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన బియ్యం పరిమాణం ఎంత, ఎంత మందికి పంపిణీ చేశారు, ఎంత మందికి పంపిణీ చేయాల్సి ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని డీలర్‌కు సూచించారు.


నెహ్రూనగర్‌లో రేషన్ డీలర్‌కు సూచనలిస్తున్న కలెక్టర్


పరిశ్రమలో పసుపు పొడి చేసే యంత్రాలను పరిశీలిస్తున్న రైతు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త సత్యనారాయణ రెడ్డి

పసుపు పరిశ్రమ పరిశీలన

జక్రాన్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ జేఎంకేపీఎం పసుపు రైతుల ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను శనివారం రైతు పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. యూనివర్సిటీలో సీనియర్ శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ సత్యనారాయణరెడ్డి వివిధ రకాల పంటలపై పరిశీలన చేస్తూ.. ఇతర ఆర్గానిక్ పద్ధతుల్లో పంటలపై రైతు లకు అవగాహన కల్పిస్తూ.. పరిశ్రమలో యంత్రాలను పరిశీలించారు. కేరళ రాష్ట్రానికి చెందిన శాస్త్రవేత్త శశిమందరి సందర్శించి, మారుమూల ప్రాంతంలో పసుపు రైతులు, ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటుచేసి రైతురత్న అవార్డు తీసుకున్న చైర్మన్ తిరుపతిరెడ్డిని అభినందించారు. రైతులు, ఉత్పత్తిదారుల సంఘాల పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరారు.

నాళేశ్వర్, బినోలలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


నాళేశ్వర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నవీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్, బినోలలో శనివారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలైన నాళేశ్వర్, బినోలలో సుమారు 100మంది పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అధికారులు కోరారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గ్రామాలలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టడానికి ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, నవీపేట ఎస్ఐలు తిరుపతి, యాదగిరి గౌడ్, మాక్లూర్ ఎస్ఐలు రాజశేఖర్, మొగులయ్య, నిజామాబాద్ 5వ టౌన్ ఎస్ఐ గంగాధర్, సివిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


బడి బయట పిల్లలను గుర్తించిన సీఆర్పీ

బోధన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని బోధన్ ఎంఈవో నాగయ్య అన్నారు. బోధన్ మండలంలో కొనసాగుతున్న బడి బయట పిల్లల సర్వేను క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఆయ న అన్నారు. శనివారం సీఆర్పీ విజయ్ పెంటాఖుర్దు కాంప్లెక్స్ పరిధిలోని భవానీపేట్ గ్రామంలో బడి బయట ఉన్న పిల్లలను సర్వే నిర్వహించి విద్యార్థిని అక్షయకు కౌన్సిలింగ్ నిర్వహించి సమీపంలోని సంగం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. 6 నుంచి 16 సంవత్సరాల వయసు గల విద్యార్థులను గుర్తించి వారిని తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలన్న లక్ష్యంగా జనవరి 12 వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. ఇది ప్రభుత్వ విద్యావ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడంతో పాటు ప్రతి బిడ్డకు విద్య అందించడమే ప్రభుత్వ ఆశయానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులు తదితరులున్నారు.


ఆర్మూర్‌లో నివాళి అర్పిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, దళిత నాయకులు


బోధన్‌లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


యాద్గార్‌పూర్‌లో నివాళి అర్పిస్తున్న దృశ్యం


కోనాపూర్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


డొంకేశ్వర్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం


జక్రాన్‌పల్లి మండలకేంద్రంలో..


భీమ్‌గల్‌లో నివాళులు అర్పిస్తున్న దళిత ఐక్య సంఘటన సభ్యులు

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని దళిత సంఘాల నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మండలకేంద్రాల్లో, గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కృషిని గుర్తుచేసుకుంటూ పలువురు వక్తలు ప్రసంగాలు చేశారు. ఆర్మూర్‌లో ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. నవీపేటలో జనవికాస్ సంస్థ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.

- నెట్‌వర్క్ ఆంధ్రజ్యోతి


ఆర్మూర్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి


రామన్నపేట్ గ్రామంలో..


నవీపేటలో నినాదాలు చేస్తున్న నాయకులు


ఆలూర్‌లో అంబేద్కర్ వర్ధంతి..

పంచాయతీ టు పార్లమెంట్





జక్రాన్‌పల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఒడిదొడుకులు, విమర్శలు, సత్కారాలు, ఛీత్కారాలు, ఎత్తులు, పైఎత్తులతో కూడుకున్నది రాజకీయం. ఒక్క పదవి దక్కేందుకు ఎంతో మంది ఆదరాభిమానాలు చూరగొనాల్సి ఉంటుంది. అలాంటిది ఒక సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీగా ఎదగడం అంటే ఆశామాషీ విషయం కాదు. కానీ మన ఇందూరు జిల్లా నుంచి ఓ నేత ఆ ఘనత సాధించారు. జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లిలో జన్మించిన స్వర్గీయ గడ్డం గంగారెడ్డి తొలిసారిగా 1956 నుంచి 1960 వరకు ఉమ్మడి పడకల్, కేశ్‌పల్లి సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీ నుంచి 1991లో నిజామాబాద్ ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. 19980- 2004లో రెండుసార్లు ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీడీపీకి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం 2004లో డిచ్‌పల్లి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన చేసిన పనులు నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో, అప్పటి డిచ్‌పల్లి నియోజకవర్గంలో, ఉమ్మడి పడకల్, కేశ్‌పల్లి గ్రామంలో ఆయన చేసిన అభివృద్ధి పనుల గురించి ఇప్పటికీ గుర్తుచేసుకుంటారు.

ఓట్ల వేడుకకు రాజకీయ విందు



నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెపోరు రసవత్తరంగా సాగుతోంది. ఎన్నికల పోలింగ్ దగ్గరపడుతున్న కొద్దీ గ్రామాల్లో బరిలో నిలిచే నేతలు ఎవరికి వారు గెలుపు దిశగా ముందుకు సాగుతున్నారు. విందులు, పార్టీలు ఇస్తూ అందరినీ తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఏ అవకాశాన్ని కూడా వదులుకోకుండా ప్రతి అవకాశాన్ని ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. ఏ కుటుంబంలో అయితే ఎక్కువగా ఓట్లు ఉన్నాయో వారిని భోజనానికి పిలిచి తమకు ఓట్లు వేసేలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. బరిలో ఉన్న అభ్యర్థులు ఈ విధమైన ప్రచారంతో ముందుకెళ్తున్నారు. ఇంటికి వచ్చిన వారికి ఆప్యాయంగా పలుకరిస్తూ అతిథి మర్యాదలతో విందును అందిస్తూ తమకు ఓటు వేయాలని కోరుతున్నారు. ప్రత్యేకంగా భోజనానికి రండి అంటూ విందుకు పిలుస్తున్నారు. ఆప్యాయ పలకరింపులతో విందు రాజకీయాలు సాగుతున్నాయి. మరి ఈ విందు రాజకీయాలు ఎన్నికల బరిలో ఉన్న అభ్య ర్థులకు గెలుపు తివాచీ పరుస్తాయో.. లేదో చూడాలి మరి.



మెప్పించి.. ఒప్పించి



మోపాల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార పార్టీ సహా వివిధ రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు హోరాహోరీగా నామినేషన్లను ధాఖలు చేశారు. మోపాల్ మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ స్థానాలకు 105 నామినేషన్లు దాఖలయ్యాయి. అదే విధంగా 192 వార్డు సభ్యులు ఉండగా 400 మంది అభ్యర్థులు పోటీకి నామినేషన్లు వేశారు. నామినేషన్ ఉపసంహరణ 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు ఉండటంతో గ్రామాల్లో అధికార పార్టీ నుంచి ఒకరిని మించి ఎక్కువ మంది పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ఆ పార్టీ నాయకులు మెప్పించి ఉపసంహరించుకునేలా ఒప్పించే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. మండలంలో ఒక నర్సింగ్‌పల్లి సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు ఒకే ఒక్క నామినేషన్ దాఖలు చేశారు. ఈ గ్రామం నుంచి అందరూ ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. మిగతా 20 గ్రామ పంచాయతీలకు పోటీ తీవ్రంగా ఉంది. అధికార పార్టీ నాయకులకు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అభ్యర్థులు పోటీగా ఉన్నారు. మంచిప్ప, బాడ్సి ముదక్‌పల్లి, కులాస్‌పూర్, న్యాల్‌కల్ గ్రామాలలో పోటీ తీవ్రంగా ఉంది. నామినేషన్ వేసిన అభ్యర్థులను ఉపసంహరించేందుకు కూడా డబ్బుల బేరం ఆడుతున్నట్లు సమాచారం.

సమర్ధ మహరాజ్‌కు ఘన స్వాగతం



స్వామి సమర్థ మహరాజ్‌తో ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకకు చెందిన శ్రీ సమర్థ మహరాజ్ శుక్రవారం రాత్రి బాన్సువాడ మండలంలోని దేశాయిపేట గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, శంభురెడ్డిలు స్వామీజీని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజకు ఏర్పాట్లు

మద్నూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మండల కేంద్రంలో ప్రతి ఏడాది డిసెంబర్ 7న నిర్వహించే అయ్యప పడిపూజను ఈ ఏడాది సైతం నిర్వహించేందుకు అయ్యప్ప స్వాములు ఏర్పాట్లుచేస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పడిపూజ నిర్వహిస్తున్నట్లు స్వాములు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి స్వాములు, గురుస్వాములు వస్తారన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజ ప్రారంభమై తెల్లవారే వరకు కొనసాగుతుందని చెప్పారు. భక్తులు ఈ పూజా కార్యక్రమానికి తరలివచ్చి అయ్యప్ప ఆశీస్సులు పొందాలని కోరారు.

బాధిత కుటుంబీకులకు ఎల్‌వోసీ అందజేత

ముప్కాల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని ఇత్వర్‌పేట్ గ్రామానికి చెందిన తుడుం సంపత్ కాలుకు ఆపరేషన్ నిమిత్తం నగదు అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నిమ్స్ హస్పిటల్‌లో చికిత్స కొరకు రూ.75వేల ఎల్‌వోసీని మంజూరుచేయించారు. ఈ మేరకు ఆ పత్రాన్ని కుటుంబీకులకు శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నామినేషన్ల పరిశీలన సంపూర్ణం



పచ్చలనడ్కుడలో నామినేషన్‌లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

వేల్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 5 క్లస్టర్‌లలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలను శనివారం అధికారులు పరిశీలించారు. మండలంలో 18 జీపీలకు గాను 121 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 180 వార్డు స్థానాలకు గాను 426 నామినేషన్‌లు దాఖలయ్యాయి. నామినేషన్లను పరిశీలించిన అనంతరం అన్ని నామినేషన్‌లు సక్రమంగా ఉన్నట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు.

'కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం'

సుభాష్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో మోసాలు, అవినీతి, నిర్లక్ష్యం మాత్రమే పెరిగాయని, అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి ఆరోపించారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకొని నిర్వహించుకుంటున్న ప్రజా పాలన ఉత్సవాలు అవినీతి, నిర్లక్ష్యం అమలు కాని హామీల ఉత్సవం అని విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్ని ప్రభుత్వ రంగాలు విఫలమయ్యాయన్నారు. బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

హోదా దక్కినా.. అభివృద్ధి దూరమేనా..?



బిచ్కుందలోని మునిసిపాలిటీ కార్యాలయం

- 8 నెలల క్రితం మునిసిపాలిటీ హోదా
- ఇప్పటికీ మంజూరుకాని సిబ్బంది
- బిచ్కుందలో కుంటుపడిన అభివృద్ధి
- విలీన గ్రామాల్లో సైతం సమస్యలు
- సిబ్బందిని కేటాయించాలని వేడుకోలు

బిచ్కుంద, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిచ్కుంద మునిసిపాలిటీగా ఏర్పాటైతే ప్రత్యేక నిధు లతో అభి వృద్ధి పనులు జరుగుతాయని ఎదురుచూసిన ప్రజ లకు నిరాశే మిగిలింది. జుక్కల్ నియోజకవర్గంలో బిచ్కుంద పట్టణాన్ని 8 నెలల క్రితం మునిసిపాలిటీ హోదా ఇచ్చి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికీ నేటికీ అందుకు సంబంధించిన సి బ్బందిని కేటాయించ లేదు. దీంతో బిచ్కుంద పట్టణానికి మునిసిపాలిటీ హోదా దక్కినా అభివృద్ధి మా త్రం దూరమేనా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సిబ్బందిని ఇప్పటికీ కేటాయించలే..

మునిసిపాలిటీ విధుల నిర్వహణకు వాస్తవానికి ఒక శానిటైజర్ ఇన్‌స్పెక్టర్, వైద్య అధికారి, శాని టైజర్ జవాన్, మేనేజర్, రెవెన్యూ అధికారి, టౌన్ ప్లానింగ్ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్ ఇద్దరు, జూనియర్ అసిస్టెంట్ ఐదుగురు, వార్డు అధికారులు నియమతులవ్వాలి. కానీ బిచ్కుంద మునిసిపాలిటీలో ప్రస్తుతం మున్సిపల్ కమిషనర్, అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్ ఉన్నారు. ఇక మేనేజర్, టౌన్ ప్లానింగ్ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అధికారి డిప్యూటేషన్‌లపై కొనసాగుతున్నారు.

విలీన గ్రామాల్లో ప్రజల ఇబ్బందులు..

మునిసిపాలిటీలో విలీనమైన గోపన్‌పల్లి, దౌల్తాపూర్, కందర్ పల్లి గ్రామాలో సైతం సమస్యలు పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధల్లో బోరుమోటార్ చెడిపోతే కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గతంలో ఉన్న పంచాయతీ పాలనే బాగుండేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని 22 వేల మంది ప్రజల సమస్యలు అభివృద్ధి కోసం పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ పాలనే బాగుండేది



బిచ్కుంద మునిసిపాలిటీలో మా గ్రామం విలీనమయ్యాక ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. గ్రామ పంచాయతీ పాలననే బాగుండేది. వద్దన్నా మా గ్రామాన్ని విలీనం చేశారు. ఇప్పుడు సమస్యల పరిష్కారానికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- రోహిదాస్, కందరపల్లి గ్రామస్థుడు

నిధుల కొరత ఉంది



నిధులు లేక సమస్యలు పరిష్కరించడంలో ఇబ్బంది ఏర్పడుతోంది. ప్రస్తుతం మునిసిపాలిటీలో వసూలైన ఇంటి పన్నులతో సమస్యలు పరిష్కరిస్తున్నాం. పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు.

- ఖయ్యూం, మునిసిపల్ కమిషనర్

అర్ధరాత్రి వరకు నామినేషన్ల పరిశీలన

మద్నూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో నామినేషన్ల పర్వం రాత్రి వరకు కొనసాగగా అర్ధరాత్రి వరకు అధికారులు నామినేషన్లను పరిశీలించారు. మద్నూర్ మండలంలో 21 గ్రామపంచాయతీలకు గాను 164 దరఖాస్తులు రాగా, 202 వార్డు స్థానాలకు 446 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా డోంగ్లి మండలంలో 13 గ్రామ పంచాయతీలకు 91 మంది సర్పంచ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 116 వార్డులకు గాను 254 మంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో డిసెంబర్ 17న మూడో విడత ఎన్నికలు జరగనున్నాయి.

జుక్కల్: మండలంలో వివిధ గ్రామ పంచాయతీలలో 162 మంది సర్పంచ్ పదవికి నామినేషన్లు సమర్పించారు. అదేవిధంగా వార్డు సభ్యులుగా 462 మంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్లు జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. శనివారం రోజు అభ్యరుల నామినేషన్లు పరిశీలించగా నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని ఎన్నికల అధికారులు తెలిపారు. నామినేషన్లు సమర్పించిన అభ్యర్థులు ఆదివారం రోజు గుర్తులు కేటాయిస్తామని ఎంపీడీవో అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి బ్యాలెట్ పేపర్ ముద్రణ జరుగుతుందన్నారు.

ఈశ్వరచారి త్యాగం వృథా కాదు



బోధన్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బోధన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర చారి త్యాగం వృథా కాదని బోధన్ బీసీ జేఏసీ సంఘాల కన్వీనర్ గాండ్ల రవీందర్ యాదవ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గల అమరవీరుల స్తూపం వద్ద బీసీ రిజర్వేషన్‌ల కోసం ఆత్మబలిదానం చేసుకున్న సాయి ఈశ్వర చారికి ఘన నివాళులు అర్పించారు. స్వార్థ రాజకీయాలకు మరో విశ్వకర్మ ముద్దుబిడ్డ ఆత్మహుతి చేసుకున్నాడని, బీసీ రిజర్వేషన్‌ల సాధన కోసం అమరుడైన ఈశ్వర చారి ఆత్మత్యాగం వృథాగా పోదన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మారోజి సుధాకర్ చారి, బీసీ సంఘం నాయకులు గుమ్ముల అశోక్ రెడ్డి, మాసుల శ్రీనివాస్, గోపి కిషన్, రవి శంకర్ గౌడ్, శంకర్ గౌడ్, హన్మాండ్లు చారి, శేఖర్, శ్రీను, అశోక్ చారి, ఉదయ్, కస్నా లింగం, సాగర్ గౌడ్‌లతో బీసీ నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోకు సన్మానం



డా.రవీందర్‌ను సన్మానిస్తున్న గామస్థులు

ఏర్గట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే డిప్యూటీ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన డా.రవీందర్‌ను శనివారం గ్రామస్థులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో గడ్డం లింగారెడ్డి, కొరిపెల్లి లింగారెడ్డి, ఇప్ప మాల్లారెడ్డి, కొరిపెల్లి వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

రెంజల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రూరల్ సీఐ విజయ్ బాబుఅన్నారు. శనివారం మండలంలోని నీలా, సాటాపూర్ గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కవాతు నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుతంగా సాగేందుకే పోలీసుల కవాతు నిర్వహించినట్లు సీఐ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని సూచించారు. కవాతులో బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ, బోధన్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి, రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్, రెంజల్, ఎడపల్లి మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నీలాలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉద్యోగానికి రాజీనామా చేసి.. ఎన్నికల బరిలో దిగి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎల్లారెడ్డి మండల పరిధిలోని మాచాపూర్ గ్రామ పంచాయతీలో గత 15 సంవత్సరాలుగా కారోబర్‌గా విధులు నిర్వహి స్తున్న ఖాజాపాషా తన ఉద్యోగానికి రాజీనా మా చేసి సర్పంచ్ బరిలో నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థుల మద్దతుతోనే సర్పంచ్ బరిలో నిలిచా నని, గ్రామస్థులు తనకు అండగా ఉన్నారని అన్నారు. గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు ఉత్తమ సేవలందిస్తానని అన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ

ఏర్గట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అయప్ప స్వామి దేవాలయంలో శనివారం అయ్యప్ప ఆరట్టు పల్లకి సేవ నిర్వహించారు. సౌడలా వినోద్ గురుస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు రాకేష్ పంతులు ఆ ద్వర్యంలో పలకి సేవ ఆయలం నుంచి గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లగా అయ్యప్ప స్వాములు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద స్వామికి అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ఏర్గట్ల మండల కేంద్రంలో అయ్యప్పస్వామి పల్లకి సేవలో పాల్గొన్న మహిళలు



వేల్పూర్‌లో పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

వేల్పూర్: మండల కేంద్రంలో తీగెల మధు గురుస్వామి ఇంట్లో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని పురోహితులు కరుణాకరణ్ శర్మ, పవన్‌సింగ్ ఆద్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి భక్తిపాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

బోధన్: అయ్యప్ప దీక్ష చాలా పవిత్రమైనదని, కఠోరమైన దీక్షతో స్వామిని పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అయ్యప్ప ఆలయ అర్చకులు సంతోష్ శర్మ అన్నారు. శనివారం బోధన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో కొనసాగుతున్న భిక్ష కార్యక్రమం శనివారంతో 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ట్రస్మా జిల్లా అధ్యక్షులు ఇందూర్ హైస్కూల్ కరస్పాండెంట్ కొడాలి కిషోర్‌తో పాటు బోధన్‌కు చెందిన పుష్ప, సుశీల, పాలడుగు చైత్విన్, శ్రీనివాస్‌లు అయ్యప్ప స్వాములకు భిక్ష నిర్వహించారు.గురు స్వాములు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

బాన్సువాడటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, అంబేద్కర్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలో శనివారం రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక నాయకులు ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు యన్. బాల్‌రాజ్ మాట్లాడుతూ.. డా.బీఆర్ అంబేద్కర్ మన దేశ ప్రజల కోసం, వారి హక్కుల కోసం అనేక రకాలుగా పోరాడారని అన్నారు. దేశంలో ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి బస్వరాజ్ పటేల్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఆరిఫ్, అంబేద్కర్ సంఘం నాయకులు కొరిమె రఘు, బ్రహ్మయ్య, అంబేద్కర్ సంఘం బీర్కూర్ నాయకులు మేడే శ్రీకాంత్, గైని శివ, మెంటే మధు, సంగేమ్ శివ, గైని చింటూ, గైని క్యాకయ్యా, ముడ లక్ష్మణ్, ఎనమ్మ చింటు పాల్గొన్నారు.

మద్నూర్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మద్నూర్ మండల కేంద్రంలో సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్న వారు స్థానిక పెద్దశక్కర్గగా చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహనికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ అంబేద్కర్ బాటలో నడవాలని సూచించారు.



బాన్సువాడలో అంబేద్కర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం



బీర్కూర్‌లో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న నాయకులు

జర దేఖో



రోడ్డు పక్కన దట్టంగా పెరిగిన పొదలు

గుబులు పుట్టిస్తున్న పొదలు

డొంకేశ్వర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ నుంచి తొండకూర్ వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. డొంకేశ్వర్ నుంచి అన్నారం రహదారిలో తెప్పలమడుగు సమీపంలో రోడ్డు పక్కన పొదలు, చెట్ల కొమ్మలు దట్టంగా పెరిగి వాహనదాలకు అడ్డొస్తున్నాయి. రోడ్డు ఇరుకుగా మారండంతో ఎదురెదురుగా భారీ వాహనాలు వచ్చినప్పుడు ద్విచక్ర వాహనదారులు రోడ్డు పక్కకు వెళ్లలేకపోతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పక్కకు వెళ్తే కొమ్మలు తగులుతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ఆనుకుని ఉన్న పొదలు, చెట్లను కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

దోమకొండ గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుతా

» సర్పంచ్ అభ్యర్థి పున్న లక్ష్మణ్



దోమకొండలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి పున్న లక్ష్మణ్

దోమకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దోమకొండలో అవినీతి రహితంగా ప్రజలకు పాలన అందిస్తానని దోమకొండ సర్పంచ్ అభ్యర్థి పున్న లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సహకారంతో దోమకొండ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నానని, సీరియల్ నంబర్7లో టూత్‌పేస్ట్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే డ్రైనేజీలు, రోడ్లు, విద్యుత్‌దీపాల సమస్యలు లేకుండా దోమకొండ గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుతానని అన్నారు. దోమకొండలో మంజూరైన 50 పడకల ఆసుపత్రిని పెద్దల ఆశీర్వాదంతో శంకుస్థాపన చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. దోమకొండలో డిగ్రీకళాశాల, ఐటీఐ కళాశాలను మంజూరు చేయిస్తానన్నారు. వృద్ధులకు, వికాలాంగులకు ప్రత్యేక చోరవ తీసుకుని సహాయం చేస్తానని తెలిపారు.

మున్నూరు కాపు కార్మిక విభాగం సంయుక్త కార్యదర్శిగా రాజు



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

కామారెడ్డిరూరల్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మున్నూరుకాపు కార్మిక విభాగం నూతన కమిటీని ఆ సంఘం నేతలు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో కామారెడ్డి జిల్లా నుంచి సరంపల్లికి చెందిన మాజీసర్పంచ్ ముల్క రాజు రాష్ట్ర కార్మిక విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు మామి ళ్ల ఆంజనేయులు చేతులమీదుగా శనివారం రాజు అందుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం, గౌరవఅధ్యక్షుడు మామిళ్ళ ఆంజనేయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సేవలో పాల్గొంటానని రాజు పేర్కొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించాలి

కామారెడ్డి టౌన్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఇనోవేషన్ ఫేర్ కార్యక్రమాన్ని అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించి వి.వసంత్, బి.మల్లిక తయారు చేయించిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో ఉత్తమమైన ప్రాజెక్టును తయారుచేసిన విద్యార్థులను అభినందించి మెమొంటో అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతిని కే.భాను తేజ, చందు,ద్వితీయ బహుమతి అజయ్, నిహార్ అగస్త్య జ్ఞాని ,శివ బాలాజీ శేఖర్ ,అంకిత ,జాకీర్ లు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కర్ణ శ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు, అగస్త్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాగులో పడి రైతు మృతి



మిరుదొడ్డి గంగారాం (ఫైల్)

బీర్కూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మీరు దొడ్డి గంగారాం (46) అనే రైతు గ్రామ సమీపంలోని జమీందారు వాగులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ కు చెందిన మీరు దొడ్డి గంగారాం శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలోని తన పొలం వద్దకు నారుమడికి నీరు పెట్టడానికని వెళ్ళాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో గంగారాం భార్య సునీత తన బావ కొడుకు నవీన్‌కు చెప్పింది. నవీన్ తన బాబాయ్ గంగారం కోసం పొలం వద్దకు వెళ్లి వెతికాడు. వెతుకుతున్న క్రమంలో గంగారాం జమీందారు వాగులో పడి ఉన్నాడు. అప్పటికే గంగారాం మృతి చెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. రాత్రి గంగారాం మృతదేహాన్ని ఇంటికి తరలించారు. గంగారాం మృతి పై కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గంగారాంకుకొన్ని రోజుల క్రితం గుండెపోటు వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వరికోతల అనంతరం ధాన్యం డబ్బులు వచ్చినాక ఆపరేషన్ చేయిద్దామని అనుకున్నారు. అంతలోనే గంగారాం మృతి చెం దాడు. మృతుడికి భార్య , ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మాకు న్యాయం చేయండి

కామారెడ్డి టౌన్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ సమీపంలో గల సర్వే నంబర్ 6లో ఉన్న గుడిసెలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇటీవల ప్రభుత్వ భూమిలో అక్రమంగా వివిధ వ్యాపారాలతో పాటు నివాస గృహాలను ఏర్పాటు చేసుకున్నారని పేర్కొంటూ నోటీసులు అందించి కూల్చివేతలు చేపట్టారు. ఆ ప్రాంతంలో నివాసముండే వారికి కొద్ది రోజులు సమయం ఇచ్చి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అక్కడ నుంచి కొందరు కదలకపోవడంతో వారి గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ ఏండ్ల నుంచి ఇక్కడే తాత్కాలిక గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. ఇటీవల మున్సిపల్ స్థలమని అధికారులు నోటీసులు అందించారని, తమకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన తర్వాత ఇక్కడ నుంచి తరలించే ప్రయత్నాలు చేపట్టాలని కోరామన్నారు. ఇప్పటికైనా తగిన న్యాయం చేసే విధంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని కోరారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ముత్యంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్సై

కామారెడ్డి టౌన్, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి):బాబా సాహెబ్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం పలువురు నివాళి అర్పించారు. ఆయా రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు జిల్లా కేంద్రంలోని రైల్వేకమాన్, అశోక్ నగర్ రైల్వే గేట్, కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి, అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్ గౌడ్, కుంబాల రవి యాదవ్, గెరిగంటి లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, సంగీ మోహన్ పాల్గొన్నారు.

దోమకొండ,(బీబీపేట): బీబీపేట మండలంతో పాటు దోమకొండ మండల కేంద్రం ముత్యంపేట, గొట్టిముక్కులతో పాటు వివిధ గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముత్యంపేటలో ఎస్సై ప్రభాకర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆశబోయిన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నిమ్మ శంకర్, రాజలింగం, రాజనర్సు, ముత్తిగల్ల లింగం,గణేష్, రాంచంద్రం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట : అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అన్నారు. ఆయన శనివారం అంబేద్కర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి శాశ్వత పునాదులు వేసిన మహనీయుడు డాక్టర్ అంబేద్కర్ అని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు దుర్గయ్య, ధర్‌సింగ్, అంజయ్య, శ్రీలత, షైమద్‌లతో పాటు సిబ్బంది ఆనంద్ రెడ్డి, నాగయ్యలు ఉన్నారు.

సదాశివనగర్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను అందరూ పాటించాలని అని మాజీ వైస్ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బద్ధం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సదాశివనగర్ మండలకేంద్రంలో శనివారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీల నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి రూరల్ : ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నేతలు, అంబేద్కర్ వాదులు, ఉద్యోగులు వేరువేరుగా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్రి బాల కిసన్, దేవేందర్, ఏడీ రాజేష్, పి నర్సింలు, సతీష్, కాశీనాథ్, గజానంద్, అంబేద్కర్ వాదులు ఎడ్ల కిషన్, రమేష్, బబ్లూ, సామెల్, పద్మారావు, సాయిలు, రజాక్, సురేందర్, ఆగమయ్య, శివానందం, చిరంజీవి పాల్గొన్నారు.

రామారెడ్డి : రామారెడ్డితో పాటుగా రెడ్డిపేట్, అన్నారం, పోసానిపేట్, ఉప్పల్‌వాయి, గిద్ద, తదితర గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బొంబోతుల విజయ స్వామిగౌడ్, గజ్జల రాములు, గజ్జల శంకర్, రాజు, సాయిరెడ్డి, లింబాద్రిగౌడ్, విఠల్‌రెడ్డి, కిషన్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, నరేష్, భూపతి, శ్రీధర్, రాజనర్సు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో అంబేద్కర్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



ఎల్లారెడ్డిలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

ఓటర్లకు గాలం

(5వ పేజీ తరువాయి)

సోషల్ మీడియాలో జోరుగా చర్చలు

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా పల్లెల్లో సోషల్ మీడియాలో అభ్యర్థుల ఎన్నికపై జోరుగా చర్చ సాగుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో ఎవరిని ఎన్నుకుంటే బాగుంటుంది. అనే అంశంపై గ్రామాల్లోని వాట్సప్ గ్రూపులో చర్చను లేవదీస్తున్నారు. ఈ చర్చల్లో యువత పాల్గొంటున్నారు. కానీ చర్చలు వ్యక్తిగత ఆరోపణలకు, విమర్శలకు దారి తీస్తోంది. కొన్నిచోట్ల ఆందోళన సైతం చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల వేళ చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంటుంది. ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కృషి

(5వ పేజీ తరువాయి)

జరుగుతుందని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులు ఈ విషయాన్ని గమనించి ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు సహకరించాలని కోరారు. రైల్వేస్టేషన్ లోపల కూడా అధికారులు మడిగెలు ఏర్పాటు చేస్తారని, అవసరం ఉన్నవారు అద్దె చెల్లించి అందులో ఉండవచ్చన్నారు. మున్సిపల్ స్థలాల్లో కూరగాయల మార్కెట్, ఇతర మార్కె ట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా కేంద్రంలో ఏళ్లుగా వాహనదారులు, ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పూర్తయ్యే వరకు కోడ్ అమలులో ఉంటుంది

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత, మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు సత్యనారాయణ రెడ్డి సమక్షంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మినీ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. మండలాల వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ మదన్ మోహన్ జడ్పీ సీఈవో చందర్, డీపీఓ మురళీ, డీఎల్‌పీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో హెల్త్ ఇన్సూరెన్స్ బ్రాంచ్

కామారెడ్డి రూరల్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి)కామారెడ్డిలో హెల్త్ ఇన్సూరెన్స్ అడ్వైజర్స్ కోసం రిక్రూట్‌మెంట్ డ్రైవ్, శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శ్రీ విశ్వమాత్రే సొల్యూషన్స్ భాగస్వామ్యంతో జరిగిన ఈ కార్యక్రమంలో టాటా హెల్త్ తెలంగాణ స్టేట్ హెడ్ ఒక ముఖ్యమైన ప్రకటన చేశారు. టాటా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ విస్తరణలో భాగంగా కామారెడ్డిలో కంపెనీ బ్రాంచ్‌ను స్థాపించనున్నారు.

ఏకగ్రీవం



ఏకగ్రీవమైన లోకతండా పాలకవర్గం



ఏకగ్రీవమైన మల్లూరు తండా సర్పంచ్, వార్డుసభ్యులు

గాంధారి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బాగంగా గాంధారి మండలంలో 16గ్రామాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గాంధారి మండలంలో చెన్నాపూర్, దుర్గం, గుడివెనుక తండా, గొల్లడి తండా, హెమ్లా నాయక్ తండా, కాయతి తండా, లొంక తండా, మోతుసంగెం, మెడిపల్లి, నెరల్ తండా, పర్మల్లా తండా, పిస్కిల్‌గుట్ట తండా, రాంపూర్ గడ్డ, సోమారం, సోమ్లా నాయక్ తండా, తిప్పారం తండా గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. రెండవ విడత ఎన్నికల్లో బాగంగా మండలంలో నామినేషన్ల విత్‌డ్రా అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించడం జరిగిందన్నారు. మండలంలో ఎన్నికల విజయవంతానికి ప్రతిఒక్కరు సహకరించాలని, ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా ఏకగ్రీవం అయిన గ్రామపంచాయతీ పాలకవర్గాలను ఆయాగ్రామాల ప్రజలు సన్మానించారు.

నిజాంసాగర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజాంసాగర్ మండలంలో 14గ్రామపంచాయతీలకు ఒక గ్రామపంచాయతీ ఏకగ్రీవం కాగా 13గ్రామ పంచాయతీలకు ఈ నెల 14న ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని 121 గ్రామపంచాయతీ వార్డుస్థానాలకు గాను 21మంది ఏకగ్రీవం కాగా 114స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మండలంలోని మల్లూరు తాండ సర్పంచ్‌గా నార్యానాయక్‌ను, 8మంది వార్డుసభ్యులను గ్రామస్థులు ఏకగ్రీవం చేసుకున్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు శనివారం బ్యాలెట్ పేపర్ ఎన్నికల గుర్తులను అధికారులు కేటాయించారు. ఆదివారం నుండి అభ్యర్థుల ప్రచారాలు ఊపందుకున్నాయి.



లింగంపల్లిలో ఏకగ్రీవమైన సభ్యులు

లింగంపేట : మండలంలో ఎన్నడూ లేని విధంగా 41గ్రామ పంచాయితీలకు గాను 14గ్రామ పంచాయితీలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలో ఏకగ్రీవమైన సర్పంచ్‌ల వివరాలు ఇలా ఉన్నాయి.. అయ్యపల్లితండా పూల్‌సింగ్, బానాపూర్ సంగమేశ్వర్, బానాపూర్‌తండా పీర్‌సింగ్, మాలోత్‌సంగ్యానాయక్‌తండా సక్రు, మెంగారం కొమ్ముల మౌనిక, మాలోత్‌తండా రవి, నల్లమడుగు పెద్దతండా సంగీబాయి, రాంపల్లి స్వరూప, రాంపల్లితండా సేవ్యానాయక్, ఎల్లారం లింగంయాదవ్, సజ్జన్‌పల్లి మల్కనగర్ సిద్దవ్వ, లింగంపల్లి గొల్ల ప్రత్యూష, ముంబాజీపేటతండా అన్నాసరావు, ఒంటరిపల్లిల్లో సింగిల్ నామినేషన్‌లు రావడంతో ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో తెలిపారు.

బలవంతంగా ఉపసంహరించుకునేలా చేస్తున్నారు

● నామినేషన్ చెల్లదంటూ ఫిర్యాదులు ● సాక్షి సంతకం పెట్టిన వ్యక్తికి బెదిరింపులు ● బాన్సువాడ మండలం పోచారం గ్రామంలో ఆరోపణలు

కామారెడ్డి, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో ప్రతి పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమవుతూ వస్తుంది. స్థానికంగా ఉండే అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వ్యక్తి చేత నామినేషన్ వేయించి ఏకగ్రీవం చేస్తూ వస్తున్నారు.. అయితే ఈ ఎన్నికల్లో ఆ గ్రామంలో ఇద్దరూ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మూడోవిడతలోని బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామ పంచాయతీలో ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ పంచాయతీలో అధికార పార్టీ కాంగ్రెస్ మద్దతుదారుడు కేతావత్ రమేష్ నామినేషన్ వేయగా... ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారుడు కేతావత్ నరేష్ రాథోడ్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఈ సారి పోచారం గ్రామంలో పోటీ నెలకొన్న సందర్భంగా ప్రతిపక్షం నుంచి వేసిన అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకునేలా అధికార పార్టీ నేతలు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా కేతావత్ నరేష్ రాథోడ్ నామినేషన్ చెల్లదంటూ కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలు ఓ న్యాయవాది చేత ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయించారు. కేతావత్ నరేష్ రాథోడ్‌కు సాక్షి సంతకం పెట్టిన కేతావత్ లాల్‌సింగ్‌ను బెదిరించి సంతకం చేయించుకున్నారంటూ ఫిర్యాదులో తెలిపారు. తనను బలవంతంగా నామినేషన్ ఉపసంహరించుకునేందుకే కాంగ్రెస్ నేతలు కుట్రలు చేస్తున్నారని బీఆర్ఎస్ మద్దతుదారుడు ఆరోపించారు. బెదిరింపులకు సైతం పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను నామినేషన్ విత్ డ్రా చేసుకోనని బీఆర్ఎస్ మద్దతుదారుడు కేతావత్ నరేష్ రాథోడ్ చెబుతున్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రా కింగ్ తాలుకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటదార

బాన్సువాడ

మహేశ్వరి ఆంధ్రాకింగ్ తాలూకా
వెంకటేశ్వర కలివివనం

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తా

» జంగంపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మాడుగుల శోభానర్సింలు యాదవ్



జంగంపల్లిలో సర్పంచ్ అభ్యర్థి శోభానర్సింలు యాదవ్ ప్రచారం

భిక్కనూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లపట్టాలు ఇప్పిస్తానని భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామసర్పంచ్ అభ్యర్థి మాడుగుల శోభా నర్సింలుయాదవ్ అన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారాన్ని తన భర్త నర్సింలుయాదవ్‌తో కలిసి నిర్వహించారు. తాము ఎప్పుడూ ప్రజల్లోనే ఉన్నామని, ప్రజల కోసమే నిరంతరం కృషిచేశామని అన్నారు. ఈ నెల 11న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గ్రామ ప్రజలు తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలో తమకు మంచి స్పందన వస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మహమ్మద్‌నగర్‌లో దివ్యాంగుల దినోత్సవం



ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

మహమ్మద్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగిఉండి, వారి ఆత్మవిశ్వాసం పెంపొందే విధంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రవర్తించాలని, వారికి తగిన సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ మధుసూదన్ రాజు, సాయిలు, రవిచంద్, తదితరులు పాల్గొన్నారు

పాస్‌బుక్కులు తీసుకోండి



విండోలో మాట్లాడుతున్న చైర్మన్ కొడిప్యాక తిరుపతిగౌడ్

దోమకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలో సింగిల్ విండో పరిధిలో గల ముత్యంపేట, చింతమాన్‌పల్లి గ్రామాలకు చెందిన రైతులు సొసైటీలో ఎరువులకు కావాలసిన పాసు బుక్కును తీసుకోవాలని సింగిల్ విండో చైర్మన్ కొడిప్యాక తిరుపతి గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాపాస్‌బుక్కు జిరాక్స్ తీసుకు వచ్చి విండో కార్యాలయంలో సం ప్రదించాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా విండోలో సిబ్బందిని సంప్రదించాలన్నారు. సోమవారం ఏఈవో క్రిష్ణారెడ్డి రైతులకు పాస్‌బుక్కులను అందజేయడానికి విండో కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు. మండలంలోని ముత్యంపేట సింగిల్ విండో పరిధిలో గల చింతమాన్‌పల్లి, ముత్యంపేటలో ఏర్పాటు చేసిన రెండు వరిధాన్యం కొనుగోలు సెంటర్ల నుంచి శనివారం నాటికి 73 వేల వరిధాన్యం బస్తాలను రైస్‌మిల్లులకు తరలించినట్లు విండో చైర్మన్ కొడిప్యాక తిరుపతిగౌడ్ తెలిపారు.

సాయి ఈశ్వరచారి మృతికి నిరసనగా ర్యాలీ

(5వ పేజీ తరువాయి)

తెలంగాణ మలి దశ ఉద్యమానికి శ్రీకాంతాచారి ఊపిరి పోస్తే ఇప్పుడు బీసీ ఉద్యమనికి ఈశ్వరాచారి అగ్గి రాజేసిందని తెలిపారు. శ్రీకాంత్ చారి మరణం ఎలా అయితే వృథా కాలేదో ఈశ్వరాచారి మరణం కూడా వృథా కాదని అన్నారు. జనాభా దామాషా ప్రకారం మెమెంతో మాకంత అనే నినాదంతో రిజర్వేషన్లు సాధించి చారికి నిజమైన నివాళులు అర్పిస్తామని తెలిపారు. చారి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి,కుటుంబంలోని వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని,పిల్లల చదువుకు బాధ్యత తీసుకోవాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు నీల నాగరాజు, కుంబాల లక్ష్మణ్ యాదవ్,స్వర్ణకార సంఘం నాయకులు,బీసీ సంఘం మహిళా అధ్యక్షురాలు బాజ లలిత తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అమూల్యమైనవి

(5వ పేజీ తరువాయి)

కామారెడ్డి జిల్లాలో ఇటీవల మరణించిన హెచ్‌జీ 247 జి.శ్రీనివాస్‌కు రూ.5,00,000 మంజూరు కాగా ఆయన కుటుంబానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. హోంగార్డుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులతో ప్రత్యేకంగా రూపొందించిన మెడికల్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.33 లక్షల ఇన్సూరెన్స్ కవరేజ్, రూ.10,000 అవుట్ పేషెంట్ చికిత్స, రెండు ఫుల్‌బాడీ చెకప్ వోచర్లు, కుటుంబ సభ్యులకు వర్తించే వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుక వచ్చినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల వంటి ముఖ్య సందర్భాల్లో పని ఒత్తిడి ఉన్నప్పటికీ హోంగార్డులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారని అభినందించారు. సాంకేతిక విధులు, సీసీటీఎన్ఎస్, రైటర్స్ పనులు, విపత్తు నిర్వహణ, వరదల్లో రక్షణ చర్యల వంటి పలు బాధ్యతల్లో ముందుండి పని చేస్తున్నారని తెలిపారు. ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణలో నిరంతరం సేవలందిస్తూ పోలీసుశాఖకు, రాష్ట్రానికి గౌరవం తెస్తున్నారని ప్రశంసించారు. అనంతరం విధుల్లో ఎలాంటి రిమార్కులు లేకుండా ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్యరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యన్. మధుసూదన్, ఆర్ఐలు యన్.కృష్ణ, నవీన్, సంతోష్ కుమార్, ఆర్ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



చింతమాన్‌పల్లిలో పోలింగ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్సై

దోమకొండ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్సై ప్రభాకర్ అన్నారు. మండలంలోని ముత్యంపేట, చింతమాన్‌పల్లి, దోమకొండ గ్రామాల్లో శనివారం ఆయన పోలింగ్‌స్టేషన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండలంలో పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించారని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లకు కావాల్సిన వసతులు, ఓటింగ్ వేసే విధానంలో ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు.